క్లుప్తంగా

నిత్యాన్నదాన సంస్థకు విరాళం



నగదు అందజేసిన దాతలు

బనగానపల్లెరూరల్: మండలంలోని టంగుటూరులో వెలసిని శ్రీ పెద్దమ్మ గుడి సమీపాన చేపట్టిన శ్రీపెద్దమ్మ తల్లి నిత్యాన్నదాన భవన నిర్మాణానికి గొస్పాడు మండలం రాయపాడుకు చెందిన కాటంరెడ్డి చెన్నారెడ్డి, జయ లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు రూ.50వేలు విరాళం ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన దాతలు అనంతరం సంస్థ నిర్వాహకులు రామగంగిరెడ్డికి నగదు అందజేశారు. దాతలకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పార్కుకు నాలుగు బెంచీల విరాళం



పార్కులో ఏర్పాటు చేసిన బెంచీలను చూపుతున్న ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు

డోన్ టౌన్: పట్టణంలోని తారకరామనగర్ పార్కుకు మంగళవారం దాతలు నాలుగు సిమెంట్ బెంచీలను విరాళంగా ఇచ్చారు. మున్సిపల్ అధికారులు ఈ పార్కు నిర్వాహణ బాధ్యతలను ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు క్లబ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఆర్టీసీ డిపో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పక్కీరయ్య, ఎంఎఫ్ పుల్లయ్యతో పాటు రిటైర్డ్ హెచ్‌ఎం రామదాసులు కలిసి నాలుగు బెంచీలను ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులకు అప్పగిచగా వారు పార్కులో ఏర్పాటు చేశారు.

వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



వాసవీ క్లబ్ సభ్యులను అభినందిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: పట్టణంలోని అమ్మవారిశాలలో మంగళవారం వాసవీ క్లబ్ నూతన అధ్యక్షుడిగా బళ్లాని సూర్య, కార్యదర్శిగా వెంకట సుబ్బయ్య గుప్త, కోశాధికారి వెంకటరమణతోపాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా బళ్లాని సూర్యను వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బాబుల్‌రెడ్డి, ఆర్యవైశ్యులు అభినందించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఇంటర్ నేషనల్ డైరక్టర్ గుండా నాగ సుప్రజ, ట్రెజరర్ వీరయ్య, జిల్లా పాస్ట్ గవర్నర్ మురళీ, సభ్యులు కందగడ్డల మోహన్‌రావు, కలికి వెంకట సతీష్, అనుముల విజయ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న సంఘం నాయకులు

ప్యాపిలి: మండల పరిధిలోని హుసేనాపురంలో విద్యుదాఘాతంతో నష్టపోయిన కుటుంబానికి వాల్మీకి బోయ సంఘం నాయకులు మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. మండల అధ్యక్షుడు రామదాసు ఆధ్వర్యంలో బాధితుడు బోయ ఆదినారాయణకు రూ. 16 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వాల్మీకి బోయ సంఘం నాయకులు మాట్లాడుతూ విద్యుదాఘాతానికి ఇంటిలోని విలువైన సామాగ్రి, తిండి గింజలు, దుస్తులు కూడా కాలిపోవడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికసాయం అందజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బంగి నాగరాజు, తలారి కేశవులు, మధుసూధన్ రాజు, కొప్పుల అనుమప్ప, మెడగట్టి అచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమానికి వృద్ధురాలు

డోన్ టౌన్: కోడలు, కుమారుడు పట్టించుకోకపోవడంతో కొడుమూరు ప్రాతానికి చెందిన ఓ వృద్ధురాలు మంగళవారం డోన్‌లోని హోసన్నా వృద్ధాశ్రమాన్ని ఆశ్రయించారు. కోడలు తిడుంతుంటే కుమారుడు ఏమి చెప్పలేక పడుతున్న ఇబ్బందిని చూడలేక ఆశ్రయానికి రావడంతో ఆశ్రమం నిర్వాహకులు జాన్ ప్రభాకర్ అక్కున చేర్చుకున్నాడు. ఆందోళన చెందొద్దని అన్నివిషయాలు తాము చూసుకుంటామని ఆయన వృద్ధురాలని ఓదార్చారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు

ప్యాపిలి: స్థానిక ప్రియదర్శిని పాఠశాలలో మంగళవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. హెచ్‌ఎం పార్థసారథి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు పాఠశాల ఆవరణను అందమైన రంగవల్లులతో ముంచెత్తారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు ఎంతో విశిష్టత ఉందన్నారు. సంక్రాంతి నాడు సూర్యుడు దక్షిణాయనం పూర్తి చేసుకుని ఉత్తరాయణంలోకి ప్రవేశించడంతో పాటు మకర రాశిలోకి ప్రవేశిస్తాడని తెలిపారు.



గతంలో రేకులకుంట వరకు రహదారి దుస్థితి,



ప్రస్తుతం రేకుల కుంట వరకు నూతనంగా నిర్మించిన రహదారి

కళకళలాడుతున్న రహదారులు

డోన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డోన్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఇచ్చిన హామీ అమలు అవుతోంది. డోన్ ఎమ్మెల్యే, ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి విన్నపం మేరకు సీఎం సమృద్ధిగా నిధులు చేస్తున్నారు. ప్రత్యేకించి పట్టణంతోపాటు గ్రామీణ రహదారుల రూపురేఖలు మార్చుతున్నారు మంత్రి బుగ్గన. ఈ మేరకు అధికారయంత్రాంగం ఇప్పటికే నియోజకవర్గంలో అన్ని ప్రధాన రహదారులతో పాటు డోన్, ప్యాపిలి, బేతంచెర్ల పట్టణాల్లోనూ రోడ్ల వెడల్పు కార్యక్రమాన్ని చేపట్టి పూర్తి చేశారు. ఈ మేరకు మండలంలోని రేకులకుంట గ్రామం నుంచి ఎన్‌హెచ్ 44 ఓబులాపురం మెట్ట వరకు రూ.50లక్షలతో అరకిలోమీటర్ రోడ్డును ప్రారంభించారు. అదేవిధంగా ఓబులాపురం గ్రామం వరకు రూ.2 కోట్లతో రెండు కిలోమీటర్ల రోడ్డును నూతనంగా నిర్మించారు. ఈ ప్రధాన రోడ్లు కళకళలాడుతుండటంతో దేవరబండ, యాపదిన్నె, ఎద్దుపెంట, మల్యాల, తాడూరు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోపాటు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



గతంలో ఓబులాపురం వరకు గల రహదారి ,



ప్రస్తుతం నూతనంగా నిర్మించిన ఓబులాపురం రహదారి

బొగ్గు లారీలు నిలిపేయండి

- ప్రజల ఫిర్యాదు మేరకు ఆదేశాలు జారీ చేసిన ఎంపీడీఓ శివరామయ్య
- రోడ్డుపై దుమ్ముధూళి తొలగింపు చేపట్టిన ఫ్యాక్టరీ కార్మికులు



రోడ్డు పైపడిన బొగ్గు తుంపర్లను తొలగిస్తున్న ఫ్యాక్టరీ కార్మికులు

బనగానపల్లె: మండల పరిధిలోని యనకండ్ల గ్రామ సమీపానున్న జయజ్యోతి సిమెంట్ పరిశ్రమకు బొగ్గు సరఫరా చేసే లారీ మూలంగా ఇబ్బంది పడుతున్నామన్న ప్రజల ఫిర్యాదులనూ ఎంపీడీఓ శివరామయ్య స్పందించారు. ఈ మేరకు మంగళవారం బొగ్గు సరఫరా చేసే లారీలను నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు రోడ్డుపై పడిన దుమ్ము, దూళిని తొలగింపు పనులు చేపట్టారు. జయజ్యోతి సిమెంట్ పరిశ్రమకు రైల్వే స్టేషన్ నుంచి బొగ్గును భారీ వాహనాలు జీఎం టాకీస్, ప్రభుత్వాసుపత్రి, బత్తులూరుపాడు, యనకండ్ల మీదుగా బొగ్గును తీసుకెళ్తాయి. ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా తీసుకెళ్తుండడంతో ఈ రోడ్డుపై బొగ్గు తుంపర్లతో పాటు దూళి ఎక్కువై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు సమస్యను విన్నవించడంతో లారీల రాకపోకల తీరుపై ఆగ్రహించిన ఎంపీడీఓ శివరామయ్య వెంటనే నిలిపివేశారు. నిబంధనల ప్రకారం బొగ్గు తరలించే సమయంలో వాహనాల పైభాగాన్ని టార్పాలిన్ పట్టాలతో పకడ్బందీగా కట్టి, డస్టు కిందపడకుండా తీసుకెళ్లాలని ఫ్యాక్టరీ ప్రతినిధులను ఆదేశించారు. స్పందించిన కాంట్రాక్టర్ కార్మికులతో రోడ్డుపై ఉన్న దూళిదుమ్ము తొలగింపు కార్యక్రమాలు చేపట్టారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరం

బేతంచెర్ల: మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరమని, విద్యార్థులు విద్యతోపాటు క్రీడలపై దృష్టి సారించాలని యంబాయి జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం రవి ప్రకాశ్ రావు తెలిపారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో కోకో, అథ్లెటిక్స్ విభాగంలో ప్రతిభ చాటిన విద్యార్థులను మంగళవారం ఆయన అభినందించారు. ఈసందర్భంగా క్రీడా కారులకు హెచ్‌ఎం రవి ప్రకాశ్‌రావు ఆర్థిక సహకారంతో యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు వర ప్రసాద్, ఉమామహేశ్వరయ్య, నందప్ప, లక్ష్మీనారాయణ ఆచార్యులు, మధు శేఖర్, జాన్ పాల్ పాల్గొన్నారు.

రూ.20లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



చెరువుపల్లెలో పూర్తయిన సీసీ రోడ్డు

బనగానపల్లె: మండలంలోని చెరువుపల్లె సచివాలయ పరిధిలో రూ.20లక్షలతో సీసీ రోడ్డును నిర్మించిన్నట్లు పీఆర్ డీఈఈ నాగశ్రీనివాసులు తెలిపారు. గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు సీసీ రోడ్డు సమస్యను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దృష్టికి తీసుకొచ్చారని డీఈఈ గుర్తు చేశారు. ఈ మేరకు మంగళవారం రోడ్డు నిర్మాణాన్ని డీఈఈ పరిశీంచారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు విన్నవించిన సమస్యలను ప్రాధాన్యం మేరకు విడతలవారీగా పరిష్కరిస్తున్నామని తెలిపారు.

సంక్షేమ పథకాల అమలులో జగనన్న దేశానికే ఆదర్శం



కొలుములపల్లె లో లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

బేతంచెర్ల: సంక్షేమ పథకాల అమలులో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొలుములపల్లె, పాపసాని కొట్టాలలో ఎంపీడీఓ వెంగన్న, సర్పంచ్ చిన్న మద్ద మ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మరియమ్మ, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, నాయకులు గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు.సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు ఏర్పాటు చేయాలని, గృహాలు మంజూరు చేయా లని ఆయా గ్రామాల ప్రజలు విన్నవించగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అర్హత ఉండి కూడా సంక్షేమ పథకాలు అందనివారు సచివాలయాల్లో సంప్రదించాలని ఈ సందర్భంగా వారు సూచించారు. ఆయా కుటుంబాలకు మూడేళ్లలో ప్రభుత్వం నుంచి చేకూరిన వివరాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రంగస్వామి, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ నాయకులు శేఖరయ్య, నాగేశ్వరరావు, ఎద్దులన్న తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీధర్ రావు

అవుకు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఎంఈఓ శ్రీధర్ రావు తెలిపారు. మండల పరిధిలోని రామాపురం ఎంపీపీఎస్ పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా.. తాగునీటి సమస్య ఉందా... విద్యాబోధన ఎలా ఉంది... తదితర విషయాలను విద్యార్థులను అడిగి ఎంఈఓ తెలుసుకున్నారు. పేద విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటూ మంచిగా చదువుకోవాలని వారికి ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఆహార పదార్థాలతో పౌష్టికాహారాన్ని అందిస్తున్నదని ఎంఈఓ గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, సీసీలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలను పెంచాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న జిల్లా పీడీ

బేతంచెర్ల: గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించేందుకు అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ నంద్యాల ప్రాజెక్టు డైరక్టర్ రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురంలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ శేషన్న ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం ఐదువేల మంది కూలీలకు పనులు కల్పించేలా లక్ష్యం పెట్టుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుమ్మగాల రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రకళ, టెక్నికల్ అసిస్టెంట్ మోహన్ బాబు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి

బనగానపల్లెరూరల్: ఉపాధి పనులకు రోజు వచ్చే కూలీల సంఖ్యను పెంచాలని నంద్యాల జిల్లా డ్వామా పీడీ రామచంద్రారెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో ఏపీఓ హరికృష్ణ, ఈసీ, టీఏలతో ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్‌కు సంబంధించిన వ్యవసాయ పనులు పూర్తికావడం జరిగిందని, వ్యవసాయా కూలీలు ఇతర ప్రాంతాలకు వెలసవెళ్లకుండా సొంత గ్రామాల్లోనే ఉపాధి పనులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి రోజు జిల్లాలో లక్షమంది కూలీలు పాల్గొనేలా ప్రభుత్వం నిర్ధేశించడం జరిగిందన్నారు. కూలీలకు సంబంధించిన వేతనాలు కూడా డిసెంబర్ వరకు చెల్లించడం జరిగిందని వివరించారు.

పందులను గ్రామాలకు దూరంగా తరలించాలి

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లతోపాటు గ్రామాల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న పందులను గ్రామాలకు దూరంగా తరలించాలని ఎంపీడీఓ సుబ్బరాజు, తహసీల్దార్ ఆల్‌ఫ్రెడ్ సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా గ్రామాలకు చెందిన రైతులు పంచాయతీ కార్యదర్శులు, పందుల యజమానులతో వారు సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ, తహసీల్దార్ మాట్లాడుతూ పందులు విచ్చల విడిగా సంచరిస్తూ రైతులు సాగు చేసిన పంటను ధ్వంసం చేస్తున్నాయని, ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఎట్టిపరిస్థితుల్లో 15 రోజుల్లో గ్రామాల్లో పందులు లేకుండా తరలించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో నిర్ణయించిన తేదిలోపు పందులను తరలిస్తామని అంగీకర పత్రాన్ని పంచాయతీ కార్యదర్శులకు యాజమానులు అందజేశారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ తాహేర్‌హుస్సేన్, పశువైద్యాధికారి పద్మావతి పాల్గొన్నారు.

డ్రోన్ల సాయంతో పకడ్బందీగా భూసర్వే



డోన్ పట్టణంలో పార్కును డ్రోన్‌తో భూ సర్వే చేస్తున్న దృశ్యం

డోన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకాన్ని పట్టణ పరిధిలో పకడ్బందీగా అమలు చేస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహం సమీపానున్న పార్కులో మంగళవారం డ్రోన్ సాయంతో చేపట్టిన సర్వేను లాంఛనంగా వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు పట్టణంలో రెండు, మూడు బృందాలుగా ఏర్పడి నివాస గృహాలు, ఖాళీ స్థలాలు, ప్రభుత్వ స్థలాల సమాచారం సేకరిస్తున్నారన్నారు. ఈ సర్వేతో మున్సిపల్ పరిధి సమగ్ర సమాచారం తమ కార్యాలయంలో ఉంటుందన్నారు. సర్వేతో భూమి సొంతదారుల హక్కుల పరిరక్షణ సులువు అవుతుందని, భూ వివాదాలకు తెరపడే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ హామీతో కూడిన శాశ్వత భూహక్కు పత్రాలను ఆస్తిదారులు పొందవచ్చన్నారు. భూ కమతం పటం, పట్టణ సర్వే పటం, రీసర్వే ల్యాండ్ రిజిస్ట్రార్, 1బి రిజిస్ట్రార్, శాశ్వత భూహక్కు పత్రం లాంటివన్నీ హక్కుదారులకు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, కౌన్సిలర్లు మిట్టా ఉమామహేశ్వరి, మల్లికార్జునరెడ్డి, సాధిక్, కోఆప్షన్ మెంబర్ కుమ్మరి రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్యాల శ్రీనివాసరెడ్డి, టీపీఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో ధనుర్మాస పూజలు

డోన్: ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ, రాము శర్మ ఆధ్వర్యంలో చిన్ని కృష్ణుడిని కంసుని నుంచి కాపాడే ఘట్టాన్ని తెలియజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు గుంటూరు సుబ్బారావు, శ్రీనివాసరావు, రజినీ కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నివాళి

కొలిమిగుండ్ల: మండలంలోని మీర్జాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు బోర్రెడ్డి చిన్నతిమ్మారెడ్డి(80)అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, కోవెలకుంట్ల మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు రామసుబ్బయ్య వైఎస్సార్‌సీపీ నేత పేరం సత్యనారాయణరెడ్డి గ్రామానికి చెరుకొని తిమ్మారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

సంతాపం

డోన్ టౌన్ : రిటైర్డ్ హెచ్‌ఎం, ఎస్టీయూ సీనియర్ నాయకుడు తిరుపాలు(80)మంగళవారం ఉదయం అనారోగ్యంతో చికిత్స పొందుతూ కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మృతి చెందారు. ఆయన మృతికి ఎస్టీయూ డోన్ మండల శాఖ కార్యాలయంలో నాయకులు సంతాపం తెలిపారు. తిరుపాలు సంఘానికి చేసిన సేవలను రాష్ట్ర మాజీ అధ్యక్షుడు షణ్ముర్తి, రాష్ట్ర కార్యదర్శి ఇక్బాల్, నాయకులు రమణ,మౌలాలీ, శ్రీనివాసులు, శివ ప్రసాద్ తదితరులు గుర్తు చేశారు.

వివాహిత ఆత్మహత్య

అవుకు: మండల పరిధిలోని శివవరం గ్రామంలో ఓ వివాహిత ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అవుకు మండలం శివవరం గ్రామానికి చెందిన మారం వివాహిత మహేశ్వరమ్మ(47) మానసిక స్థితి కొతంకాలంగా సరిగాలేదన్నారు. జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో ఒంటిపై డీజిల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడిందని, స్థానికులు సమాచారం అందించగా అప్పటికే చనిపోయిందని తెలిపారు. మృతురాలి అన్న నొస్సం తిరుపంరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

మహానంది: మహానంది దేవస్థానంలో బుధవారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ట్రస్టు బోర్డు చైర్మన్ కొమ్మా పాల మహేశ్వరరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో శ్రీ కామేశ్వరిదేవి సహిత మహానందీశ్వర, కోదండ రామాలయం, వినాయక నంది, గో సంరక్షణ, అన్నదానం విభాగాల హుండీ కానుకల లెక్కింపు ఉంటుందన్నారు.

సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే కాటసాని



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కలిశారు. బనగానపల్లె నియోజకవర్గ సమస్యలు, జరుగుతున్న అభివృద్ధి పనులను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. బనగానపల్లె, కొలిమిగుండ్ల, అవుకు మండలాల్లోని మైనింగ్ సమస్యతో పాటు బనగానపల్లె పట్టణంలోని అర్హులైన పేదలకు పంపిణీ చేయాల్సిన విషయాలను సీఎంకు వివరించారు. పట్టణంలో రూ.22 కోట్లతో నిర్మిస్తున్న వంద పడకల ఏరియా ఆసుపత్రి భవన ప్రారంభోత్సవానికి సీఎం వైఎస్ జగన్‌ను ఎమ్మెల్యే కాటసాని ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు పోచా శీలారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



పనులు పరిశీలిస్తున్న పీఆర్ ఏఈ వెంకటరమణ

బనగానపల్లెరూరల్: మండలంలోని వెంకటాపురం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు మండల పీఆర్ ఏఈ వెంకటరమణ, గ్రామ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ తూర్పింటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకోవడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా సీసీ రోడ్డు, అంతర్గత రోడ్లతో పాటు విద్యుత్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి వచ్చాయన్నారు. సచివాలయానికి రూ.20లక్షలు మంజూరు కావడంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామన్నారు.

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



భూమి పూజలో పాల్గొన్న ఎంపీపీ, సర్పంచ్, వైఎస్సార్ నాయకులు

బేతంచెర్ల: మంత్రి బుగ్గర రాజేంద్రనాథ్‌రెడ్డి సహకారంతో గ్రామాలను దశలవారీగా ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు మూర్తుజావలీ, నాయకులు బాబుల్‌రెడ్డి, బుగ్గన చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గూటుపల్లెలో రూ.15 లక్షల డీఎంఎఫ్ నిధులతో 1375 మీటర్ల పొలాల రహదారికి సర్పంచ్ శ్రీరాములు, వైస్ ఎంపీపీ రంగస్వామి, నాయకులు వెంకటస్వామి, మోహన్‌రెడ్డి, భరణి, శేఖర్ ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మద్దిలేటిస్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు, వైఎస్సార్ నాయకులు ఖాజా, దస్తగిరి, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, ఎద్దులన్న, సుధాకర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

కోవెలకుంట్ల: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకటలక్ష్మి, రంగమ్మ, పుల్లమ్మ, సరస్వతీ, అరుణ, కమాల్‌బీ మంగళవారం కోవెలకుంట్ల తహసీల్దార్ పుష్పకుమారి, సంజామల తహసీల్దార్ మల్లికార్జునశర్మకు వినతి పత్రం అందజేశారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు పెంచాలని, ఫేస్‌యాప్‌ను రద్దు చేసి సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని వారు కోరారు.

బనగానపల్లె: అంగన్‌వాడీ సెంటర్లకు ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణపోషణకు అందిస్తున్న మెస్ చార్జీలను పెంచాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు షెబా ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా షెబా మాట్లాడుతూ పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం తహసీల్దార్ రామకృష్ణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ నాయకులు సుబ్బయ్య, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు రోజారమణి పాల్గొన్నారు.

బేతంచెర్ల: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎల్లయ్య, వెంకటేశ్వర్లు, అంగన్ వాడీల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుల్జార్, నాగలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు రమాదేవి, వరలక్ష్మి, సరస్వతి, నారాయణమ్మ పాల్గొన్నారు.

డోన్ టౌన్: స్థానిక బేతంచెర్ల సర్కిల్‌లో మంగళవారం జీవో నంబరు 1ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నక్కి శ్రీకాంత్,శివరాం, మండల అధ్యక్షుడు రామాంజనేయులు నాయకులు లక్ష్మన్న, నాగన్న, చిన్న రహిమాన్, విజయ్, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.